క్లుప్తంగా...

నేడు కార్వాన్‌లో మంత్రి తలసాని సమీక్ష

గోల్కొండ: కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ బోనాల ఏర్పాట్లపై నేడు కార్వాన్ శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద సమీక్ష సమావేశం జరగనుందని దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌సింగ్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా గౌరి సతీష్



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా విద్యావేత్త గౌరి సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగటడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం తన గళాన్ని వినిపిస్తానని వెల్లడించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బక్రీద్‌కు జీహెచ్‌ఎంసీ, పోలీసుల సేవలు భేష్



ఎజాజ్ అలీ ఖురేషి

చార్మినార్: పాతబస్తీలోని ముస్లింలకు మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు, హైకోర్టు న్యాయవాది ఎజాజ్ అలీ ఖురేషి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్‌ను పురస్కరించుకుని ఆయన గురువారం సామూహిక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పాతబస్తీ ముస్లింలకు బక్రీద్ ఈద్ ముబారక్ తెలిపారు. సామూహిక ప్రార్థనలకు సంబంధిత అధికారులు శామియానాలతో పాటు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో ప్లాస్టిక్ బ్యాగ్‌లను ఉచితంగా పంపిణీ చేయడంతో వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోలేదన్నారు. ఈ బక్రీద్‌కు పోలీసులు, జీహెచ్‌ఎంసీ అందించిన సేవలు మరువలేనివన్నారు.

'పండగలు మతసామరస్యానికి చిహ్నాలు'

గోల్కొండ: పండగలు మతసామరస్యానికి చిహ్నాలని గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్. రాజు వస్తాద్ అన్నారు. గురువారం ఆయన పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులతో కలిసి కుతుబ్‌షాహీ ఈద్గా, లంగర్‌హౌస్ ఈద్గా తదితర ప్రాంతాల్లో ప్రార్థనల అనంతరం ముస్లింలను బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బక్రీద్, రంజాన్, బోనాలు, వినాయక చవితి ఉత్సవాలు, బతుకమ్మ తదితర పండగలు శాంతియుతంగా జరిగేలా ఇరు వర్గాల ప్రజలు కలిసి మెలిసి పని చేస్తారని ఆయన అన్నారు. నేటి యువత సైతం శాంతి మార్గాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని ఆయన కోరారు. ఆయన వెంట పరమానందం, నర్సింగరావు, దయానంద్ తదితరులున్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం



శక్తికేంద్రం సమావేశంలో విస్తారక్, నట్రాజ్‌దామ్‌దారి తదితరులు

అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పథకాలతోనే రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని కేరళకు చెందిన జాతీయ బీజేపీ నాయకుడు విస్తారక్ పేర్కొన్నారు. గురువారం జ్ఞాన్‌బాగ్ కాలనీలో గోషామహల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు నట్రాజ్‌నామ్‌దారి ఆధ్వర్యంలో నిర్వహించిన శక్తికేందర్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణతో పాటు దేశ నలుమూలలా బీజేపీ ప్రభంజనం వీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ, కార్పొరేటర్ లాల్‌సింగ్, కమల్‌సింగ్, గుణావత్‌రావు, బిరాదరి, నరేష్ సింగ్, ముకేష్ సింగ్, విద్య షిండే, నవీన్‌అగర్వాల్, మురళీకృష్ణ, రాము, విజయ్‌కుమార్, వినోద్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'మూవింగ్ ఫ్రమ్ ఫియర్ టు లవ్' అనే అంశంపై ప్రఖ్యాత అంతర్జాతీయ మెడిటేషన్ టీచర్ చైనాకు చెందిన బి.కె.స్వప్న ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



మీరాలం ఈద్గా వద్ద..



మక్కా మసీదు వద్ద..

చిన్నారుల ఆత్మీయ ఆలింగనం



భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

- ప్రార్థనల సందర్భంగా కొనసాగిన ట్రాఫిక్ ఆంక్షలు
- శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు అధికార, అనధికార ప్రముఖులు

చార్మినార్: బక్రీద్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని నిర్వహించే సామూహిక ప్రార్థనలకు సంబంధిత అధికారులు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్త లేదు. దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మీరాలం ఈద్గాలో జరిగిన సామూహిక ప్రార్థనల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. ఉదయం 9.30 గంటలకు మక్కా మసీదులో మౌలానా హాఫీజ్ లతీఫ్ అహ్మద్, మీరాలం ఈద్గాలో కతీజ్ మహ్మద్ రిజ్వాన్ ఖురేషీ ముస్లింలతో నమాజ్ చేయించారు. బక్రీద్ ముగిసినప్పటికీ మూడు రోజుల పాటు అల్లాకు ఖుర్బానీ ఇవ్వనుండడంతో గురువారం కూడా గొర్రెలు, మేకలను ఖరీదు చేస్తుండడంతో పాతబస్తీలో సందడి నెలకొంది.

గోల్కొండలో..

గోల్కొండ: బక్రీద్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలు, జామా మసీదు వద్ద జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు భారీగా హాజరయ్యారు. గోల్కొండ కుతుబ్‌షాహీ ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనలకు ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవ భక్తి ముందు ఏదీ కూడా అడ్డుకాదన్న విషయాన్ని బక్రీద్ స్పష్టం చేస్తుందన్నారు. సౌత్, వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే ఈద్గా వద్ద స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. ఆయన వెంట పాషాభాయ్, షకీల్ అలీఖాన్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నాంపల్లిలో..

నాంపల్లి: బక్రీద్ పండగ త్యాగానికి ప్రతీక అని టీఎస్జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం. హుస్సేన్ అన్నారు. ఈ మేరకు గురువారం బక్రీద్‌ను పురస్కరించుకుని టీఎస్జీఓ సహాధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుస్సేన్‌ను సత్కరించారు.విక్రమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌బజార్‌లో..

సుల్తాన్‌బజార్: బక్రీద్‌ను పురస్కరించుకుని సుల్తాన్‌బజార్, బొగ్గులకుంట, కుబ్దిగూడ, బ్యాంక్‌స్ట్రీట్, ట్రూప్‌బజార్ తదితర ప్రాంతాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గుంటి విక్రమ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి పూల మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ కార్పొరేటర్ స్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.





కుతుబ్‌షాహీ ఈద్గా వద్ద..



అసదుద్దీన్ ఒవైసీకి మొక్కను అందజేస్తున్న విక్రమ్‌యాదవ్, స్వామియాదవ్ తదితరులు



సౌత్ వెస్ట్ డీసీపీతో పాషాభాయ్ తదితరులు



హుస్సేన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కేఆర్.రాజ్‌కుమార్, కురాడి శ్రీనివాస్

పీవీ నర్సింహారావుకు ఘన నివాళి



రాంచంద్రమూర్తికి మెమొంటోను అందజేస్తున్న భాషా నిలయం నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: పీవీ నర్సింహారావు జయంత్యుత్సవాలు గురువారం సాయంత్రం శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో ఘనంగా జరిగాయి. భాషా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు డాక్టర్ సీనియర్ జర్నలిస్ట్ కె.రాంచంద్రమూర్తి పీవీ నర్సింహారావు వ్యక్తిత్వంపై కీలక ప్రసంగం చేశారు. నర్సింహారావు జయంతి సందర్భంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కేవీ రమణాచారి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీవీ నర్సింహారావు బహుముఖ ప్రజ్ఞశాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషా నిలయం అధ్యక్షులు నూతి శంకర్‌రావు, ఉపాధ్యక్షులు కె.చంద్రప్రకాష్ రావు, గౌరవ కార్యదర్శి ఉడయవర్లు తదితరులు పాల్గొన్నారు.

4న దేవిరెడ్డి రామకోటేశ్వరరావుకు రంగస్థల పురస్కార ప్రదానం

నాంపల్లి: ప్రముఖ రంగస్థల నిపుణుడు గరిమెళ్ల రామమూర్తి 87వ జయంతిని పురస్కరించుకుని నటుడు దేవిరెడ్డి రామకోటేశ్వరరావుకు రంగస్థల పురస్కారం–2023 ప్రదానం చేస్తున్నట్లుగా నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. రసరంజని సంస్థ ఆధ్వర్యంలో జూలై 4న సాయంత్రం 6 గంటలకు నాంపల్లిలోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పురస్కార ప్రదానోత్సవ సభ జరుగుతుందని తెలిపారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగే సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి హాజరవుతున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు, సాహితీవేత్త వోలేటి పార్వతీశం, నాటక ప్రయోక్త డాక్టర్ డి.ఎస్.ఎన్.మూర్తి పాల్గొంటారని తెలిపారు. అల్లైన కల్చరల్ అసోసియేషన్ వారిచే సత్యమేవ జయతే నాటికను ఈ సందర్భంగా ప్రదర్శించబోతున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ హయాంలో అన్ని పండగలకు ఆదరణ



ధూల్‌పేట్‌లో జరిగిన వేడుకల్లో నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: బీఆర్‌ఎస్ హయాంలో అన్నివర్గాల ప్రజల పండగలకు ఆదరణ లభించిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ప్రభుత్వమే స్వయంగా బోనాలను, వినాయక చవితి వేడుకలు, దసరా, ఇతర అన్ని పండుగలను ప్రభుత్వమే స్వయంగా చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. ధూల్‌పేట మచిలిపురాలో జలక్షత్రీయ సమాజ్, గంగపుత్ర ఆధ్వర్యంలో ఆషాఢమాసం పూజా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నందకిశోర్‌వ్యాస్ బిలాల్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వమే స్వయంగా పండుగలను చేయడం తెలంగాణలోనే ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ఆయన అన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు
- ప్రత్యేక పూజల్లో భక్తులు



పూజలు చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. గోషామహల్, బిర్లామందిర్, గన్‌ఫౌండ్రీ, దారుసలాం, గౌలిగూడ, ధూల్‌పేట్, లక్డీకాపూల్ ప్రాంతాల్లోన్ని ఆలయాల్లో పెద్ద ఎత్తున భక్తులు పూజలు నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు.

సుల్తాన్‌బజార్‌లో..

సుల్తాన్‌బజార్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని సుల్తాన్‌బజార్, బడిచౌడీ, గౌలిగూడ, జంగల్ విఠోబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తరించారు. గురువారం ఉదయం నుంచే చుట్టు పక్కల ప్రాంతాల్లోని ప్రజలు వివిధ ఆలయాల వద్ద బారులు తీరారు.



జంగల్ విఠోబ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు తదితరులు



విఠలేశ్వర స్వామిని దర్శించుకున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, శంకర్‌యాదవ్

ఆర్యవైశ్యులకు 'వైశ్య బంధు' ఇవ్వండి



సదానందం గుప్తా

అబిడ్స్: ఆర్యవైశ్య కులస్తులకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం 'వైశ్య బంధు'పథకం ప్రవేశపెట్టాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడిశెట్టి సదానందంగుప్తా డిమాండ్ చేశారు. ధూల్‌పేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్య కులస్తులందరికీ వైశ్య ఆత్మీయ భవన్, వైశ్య బంధు, వైశ్య కార్పొరేషన్, వైశ్య కులవృత్తుల వారికి ఆర్థిక సాయం అందేవిధంగా వైశ్య బీదలకు ఉచిత కరెంటు, ప్రతి మండల కేంద్రాలలో వైశ్య కమ్యూనిటీ భవనం నిర్మించాలని ఆయన పేర్కొన్నారు. వైశ్య కులస్తులలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని ఆయన అన్నారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉండి తమ కులస్తుల డిమాండ్లను అమలు చేసే విధంగా అందరూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు.

వైభవంగా బోనాల వేడుకలు



వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: పురానాపూల్ అమ్మవారి ఆలయంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున స్థానిక భక్తులు పూజలు చేశారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు.

ఎప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపు



చార్మినార్: బక్రీదు సందర్భంగా వీధుల్లోని జంతు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు. పాతబస్తీలోప్రజలకు అసౌకర్యాలు కలుగకుండా జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. యానిమల్ వేస్టేజీని ఎప్పటికప్పుడు తొలగించామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ నామా సామ్రాట్ అశోక్ తెలిపారు. కీలకమైన అన్ని ప్రాంతాల ప్రజలకు ప్లాస్టిక్ బ్యాగ్‌లను ఉచితంగా అందజేశామన్నారు. పాతబస్తీలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో జేసీబీలను అందుబాటులో ఉంచి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించినట్లు ఆయన తెలిపారు.

జంతువుల వ్యర్థాలపై స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: బక్రీద్ కోసం బల్దియా వారు వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. జంతువుల వ్యర్థాలు తరలించడానికి కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో చెత్త ఎప్పటికప్పుడు తరలించడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బక్రీద్ పండగ రోజు ముస్లింలు జంతువులను ఖుర్బానీ ఇస్తారు. కాగా బస్తీలలో దుర్గంధం వ్యాపించకుండా జంతువుల వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించడం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగదాంబికకు మూడవ బోనం



మహంకాళి అమ్మవారికి పూజలు



అమ్మవారి దర్శనానికి వెళ్తున్న వృత్తిపని సంఘం వారు

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి శనివారం 3వ బోనం పూజ ఘనంగా నిర్వహించారు. పూజకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. నగీనాబాగ్‌లోని బ్యారెక్స్‌లో మహిళలు అమ్మవార్లకు నైవేద్యం తయారు చేసుకుని ముందుగా నాగదేవత పుట్టకు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి శివసత్తుల విన్యాసాలతో అమ్మవారి దర్శనానికి బయలుదేరారు.

భారీ బందోబస్తు..

బక్రీద్ పండుగ, బోనం 3వ పూజ ఒకేరోజు రావడంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరేతో పాటు ట్రాఫిక్ పోలీసులు తెల్లవారు జాము నుంచే బందోబస్తును పర్యవేక్షించారు. బక్రీద్ ప్రార్థనలు ఉదయం 6.30 గంటల నుంచే ప్రారంభం కావడంతో పోలీసులు మసీదుల వద్ద తెల్లవారు జాము 4 గంటల నుంచే టికెట్లు ఏర్పాట్లు చేశారు.

సీఎం కేసీఆర్ వల్లే బోనాలకు గుర్తింపు..

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పండగలు గుర్తింపునకు నోచుకోలేదని, అప్పటి పాలకులు తెలంగాణ పండుగలంటే చిన్నచూపు చూశారని బీఆర్‌ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవన్‌సింగ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచే బోనాలు, బతుకమ్మ పండుగలకు ప్రపంచ గుర్తింపు లభించిందన్నారు. అనంతరం అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి ఆయనను సన్మానించారు.



ఆలయ పూజారితో బీఆర్‌ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్ సింగ్

ఘనంగా బాలమురళీకృష్ణ జయంతి



గాత్ర కచేరిని ప్రదర్శిస్తున్న కళాకారులు

నాంపల్లి: పద్మ విభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ 93వ జయంతిని గురువారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో రాగ వర్ధని కల్చరల్ సొసైటీ, హోప్ సంస్థల సంయుక్త నిర్వహణలో ఘనంగా జరిగాయి. డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రియ శిష్యులు డీవీ మోహన్ కృష్ణ శిష్య బందం చేత బాలమురళి రచించిన గణపతి ప్రార్థనతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం పీఎస్‌కే రమాకాంత్ గాత్రం, ఇషిత, మయూఖ్ గాత్ర యుగళంతో గానం చేశారు. ముఖ్యఅతిథులుగా శేషాచారి, రాఘవాచారి, ఆత్మీయఅతిథిగా నేమాని సోమయాజు హాజరయ్యారు. సభానంతరం మోహనకృష్ణ శిష్యురాలు మాళవిక బాలమురళి రచనలతో గాత్ర కచేరి సమర్పించగా వయోలిన్ పీఎస్‌పీ గాయత్రి శివాని, మదంగంపై పెరవలి జయభాస్కర్, ఘటంపై నేమాని సోమయాజులు వాద్య సహకారం అందించారు. సాయి వైష్ణవి గాత్ర సహకారం అందించారు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి

గన్‌ఫౌండ్రీ: బెస్ట్ అవైలబుల్ స్కూల్ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని ధర్మసమాజ్ పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం పాఠశాల అడిషనల్ డైరెక్టర్ ఉమాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ ప్రతినిధులు కార్తీక్ మహారాజ్, మల్లేష్ మహారాజ్ మాట్లాడుతూ.. దళిత పేద విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు ఉన్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో అనేకమంది ఎస్సీ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం బీసీ గురుకుల పాఠశాలల కార్యదర్శి మల్లయ్యబట్టును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ హైదరాబాద్ శాఖ ప్రతినిధులు సైదులు మహారాజ్, నర్సింగ్ మహారాజ్, హర్ష, శివకృష్ణ, దేవేందర్ పాల్గొన్నారు.



ఏడీ ఉమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ ప్రతినిధులు

సందర్శకుల సందడి

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక స్థలాలన్ని సందర్శకులతో సందడిగా కనిపించాయి. బక్రీద్ సందర్భంగా సెలవు కావడంతో పాతబస్తీలోని సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్ పర్యాటకుల రద్దీతో కళకళలాడాయి. ఉదయం నుంచి వర్షం లేకపోవడంతో సందర్శకులు ఎక్కువ సంఖ్యలో పాతబస్తీలోని పర్యాటక స్థలాలను సందర్శించారు. చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడం వద్ద సందర్శకులు సందడి చేశారు.